

అన్నివేళలా అండగా ఉండాలి



విద్యానగర్(కరీంనగర్): స్నేహితుడు అంటే కష్టాలు, సుఖాలు, ఆపదలో అన్నివేళలా అండగా ఉండాలి. కాలక్షేపం, అవసరాల కోసం స్నేహం పేరు చెప్పుకుని పబ్బం గడుపుకోవాలని చేసే వారిని స్నేహితులు అనరు. అలాంటి స్నేహితులను దూరంగా ఉంచడమే మేలు.

– ముక్క శరత్ కృష్ణ, వ్యాపారవేత్త, తిరుమల నగర్, కరీంనగర్

స్నేహాలకు ఇప్పుడు అర్థాలు మారాయి



ప్రస్తుత కాలంలో స్నేహాలకు అర్థాలు మారాయి. ఆపదలో అండగా నిలిచే స్నేహాలు కరువయ్యాయి. గతంలో స్నేహం కోసం స్నేహం చేసేవారు. ఇప్పుడు అవసరాల కోసం స్నేహం చేస్తున్నారు. సమయం వచ్చినప్పుడు నిజమైన స్నేహాలు బయటపడుతాయి.

– పల్లెర్ల అపర్ణ, గృహిణి, అశోక్‌నగర్, కరీంనగర్

ఎప్పటికీ గుర్తుకువస్తాడు



ఇప్పటికీ ఎప్పటికీ గుర్తుకువస్తాడు మాది నేరేళ్ల. నా చిన్నప్పటి దోస్తు. క్లాస్‌మేట్ అయిన సంతోష్ 2006లో కారణాలు తెలియవు ఎందుకో ఆత్మహత్య చేసుకున్నాడు. వాడు ఇప్పటికీ ఎప్పటికీ నా మదిలో చిరస్థాయిగా ఉంటాడు. ఎప్పటికీ గుర్తుకు వస్తూనే ఉంటాడు. నాకున్న ఫ్రెండ్స్‌లో గొప్ప ఫ్రెండ్ వీడే.

– డాక్టర్ జి.వెంకటరెడ్డి, జనరల్ మెడిసిన్, సిటీ హాస్పిటల్ కరీంనగర్



కోర్కల్ మూల మలుపు వద్ద ప్రమాదకరంగా గుంతలు



శ్రీరాములపేట -కోర్కల్ మధ్య రోడ్డు దుస్థితి

అడుగు తీసి అడుగు వేయలేం

- అధ్వానంగా వీణవంక-మానకొండూర్ రోడ్డు
- ఏడేళ్లుగా పూర్తికాని పనులు
- ఆందోళనలో ప్రయాణికులు

వీణవంక: ఏళ్లు గడిచినా రహదారుల పరిస్థితి మారడం లేదు. రోడ్ల విస్తరణ పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో మండల ప్రజలు తిప్పలు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలవ్వడంతో గుంతలు కనిపించక వాహనాలు దెబ్బతింటున్నాయి. రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. ఏడేళ్ల క్రితం వీణవంక-మానకొండూరు మధ్య 66ఫీట్ల వెడల్పుతో రూ.30కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అక్కడక్కడా పనులు చేసి వదిలేశాడు. మండలంలోని శ్రీరాములపేట నుంచి కోర్కల్ వరకు సుమారు అర కిలోమీటర్ దూరం వరకు కంకర పోసి వదిలేశారు. వర్షాలకు గుంతలు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీణవంక బ్రిడ్జి నుంచి బ్రహ్మణపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాకరంగా ఉంది. వీణవంక నుంచి మానకొండూరు వరకు ఐదు చోట్ల కల్వర్టులు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మామిడాలపల్లి శివారు కొంకరకుంట వద్ద ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతు చేసినా ఫలితం లేకుండా పోతోందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రజలు ఏడేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం..

మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చల్లూరు నుంచి మల్లారెడ్డిపల్లి వరకు రోడ్డు శిథిలావస్థలో ఉంది. బేతిగల్-కనపర్తి గ్రామాల మధ్య వర్షాలకు రోడ్డు ఇరువైపులా కొట్టుకుపోవడంతో మూడేళ్లుగా ఇరుగ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. కనపర్తి-వీణవంక గ్రామాల మధ్య అండర్ బ్రిడ్జి పక్కన రోడ్డు వర్షాలకు కొట్టుకుపోవడంతో ఇప్పటికీ మరమ్మతు చేయలేదు. బొంతుపల్లి-గంగారం మధ్య కూడా అక్కడక్కడా రోడ్డు దెబ్బతిన్నంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని రహదారులకు మరమ్మతు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



చల్లూరు-మల్లారెడ్డిపల్లి మధ్య అధ్వానస్థితిలో రోడ్డు

సమగ్ర రైతు చట్టాన్ని రూపొందించాలి

హుజూరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర రైతు చట్టాలను రూపొందించి అమలుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ అన్నదాతల ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వామి నాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక హామీ అమలు చేయలేమని చేతులెత్తేసిందని తెలిపారు. విద్యుత్ సంస్కరణల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి సరిపడే విధంగా ఎరువులు సరఫరా చేయాలని, రాష్ట్రానికి యూరియా కోత విధించడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వాసుదేవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలమారెడ్డి రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి వాసుదేవ్, జిల్లా సహాయ కార్యదర్శులు శీలం అశోక్, జూనుతుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్ణ వెంకట్‌రెడ్డి

ఆయిల్‌పామ్ తోటలపై దృష్టి సారించాలి

చిగురుమామిడి: అధిక ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ తోటలపై రైతులు దృష్టి సారించాలని హుజూరాబాద్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి బి.మంజురాణి అన్నారు. శనివారం చిగురుమామిడి మండలం ముదిమానిక్యం గ్రామంలో డాక్టర్ పొన్నం చంద్రమతి వ్యవసాయక్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మొక్కలు నాటేందుకు ప్రభుత్వం సబ్సిడీ కింద డబ్బులు అందిస్తుందని, డ్రిప్ ఇరిగేషన్ కింద ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీసీలకు 90శాతం, పెద్ద రైతులకు 80శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి మంజువాణి

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

శంకరపట్నం: కేశవపట్నం ఫంక్షన్ హాల్‌లో రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లను శనివారం డీఆర్‌డీవో శ్రీధర్, ఆర్డీవో రమేశ్‌బాబు, అధికారులు పరిశీలించారు. మండలంలో 1,200 పైచిలుకు రేషన్ కార్డులు మంజూరయ్యాయని, ఆదివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్ తనుకు ప్రభాకర్, ఆలయ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు బస్వయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్‌బాబు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు


సన్నాహక సమావేశం విజయవంతం చేయండి

జమ్మికుంట: హుజూరాబాద్ సాయిరూప గార్డెన్‌లో ఈనెల 7న నిర్వహించే పెన్షన్‌దారుల సన్నాహక సమావేశానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ హాజరౌతున్న సందర్భంగా పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి అంబాల రాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వికాలంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మిట్టపల్లి రాజేశ్, వికలాంగుల సంఘం ప్రతినిధులు ముత్యాల రంగయ్య, శనిగరపు రమేశ్, మార్త కొమురయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకుడు గుండ్ల నానిమాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబాల రాజు తదితరులు

ప్రజాపాలనలో పారదర్శక లోపం



గ్రామస్తులతో సుంకె రవిశంకర్

గంగాధర: కాంగ్రెస్ ప్రజాపాలనలో పారదర్శకత లోపించిందని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. గంగాధర మండలంలోని ఒద్యారం గ్రామంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. గుడిసెల్లో ఉంటున్న తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని పలువురు గ్రామస్తులు తెలిపారు. రవిశంకర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి వేసిన కమిటీలు డబ్బులు ఇచ్చిన వారినే ఎంపిక చేశారని ఆరోపించారు. అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్: పట్టణ శివారులోని హిందూ శ్మశాన వాటిక చుట్టూ ఫెన్సింగ్ వైరు పనులకు శనివారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య భూమిపూజ చేశారు. రూ.5లక్షల మున్సిపల్ నిధులతో ఈ పనులు జరగనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు గందె శ్రీనివాస్, హరిశంకర్, నార్ల రాజేందర్, గర్రెపల్లి శ్రీనివాస్, కటకం సత్యనారాయణ, నూక శ్రీనివాస్, రేణికుంట్ల సురేశ్, నార్ల శ్రీనివాస్, అయిత భిక్షపతి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీకా కేంద్రం తనిఖీ



టీకా కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ సాజిదా

హుజూరాబాద్: పిల్లల తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సాజిదా అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యాధి నిరోధక టీకాల సెషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చెశారు. వ్యాక్సిన్ క్యారియర్‌లో కోల్డ్ చైన్ పరిశీలించారు. పిల్లలకు టీకాలు వేసే ముందు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సింగపూర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ కీర్తన, ఏఎన్‌ఎం వనిత, ఆశ కార్యకర్తలు రమాదేవి, అరుణ ఉన్నారు.

ఇంటింటికీ సంజయన్న రాఖీ పోస్టర్

గన్నేరువరం: రాఖీ పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రతీ గ్రామంలో ఇంటింటికి అందించే సంజయన్న రాఖీ పోస్టర్‌ను శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించినట్లు బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పుప్పాల రఘు, సొల్లు అజయ్‌వర్మ, వరాల జ్యోతి, బంగారు గాయిత్రి, మాసం గణేశ్, తాడూరి కిరణ్‌రెడ్డి, బామండ్ల రాజు, మునిగంటి సత్తయ్య, పుల్లెల రాము పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సహాయమంత్రి బండి సంజయ్

దీక్ష శిబిరం సందర్శన

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్‌లో ఇసుక లారీలపై తాటిపత్రిలు కప్పే ఉపాధి కల్పించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు సందర్శించారు. కొండపాక గ్రామస్తులు మాత్రమే ఉపాధి పొందుతున్నారని, కొండపాక రెవెన్యూ గ్రామంలో హిమ్మత్‌నగర్ గ్రామం కూడా ఉన్నందున మావాటా ప్రకారం ఉపాధి కల్పించాలని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఎన్టీ నిధులు కొండపాక గ్రామపంచాయతీలోపడుతున్నాయని, అవి హిమ్మత్‌నగర్‌కు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రజిత, ఆర్‌ఐ రవీందర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

జమ్మికుంట: సమాజంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పక్కన మహిళల కోసం ప్రత్యేక జిమ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో ఓపెన్ జిమ్‌లు ఐదు ఉండగా వాటి మరమ్మతు, మహిళలకు ప్రత్యేక జిమ్ ఏర్పాటుకు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పనులకు అమోదం తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, మున్సిపల్ ఏఈలు నరేశ్, వికాస్, ఈఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అయాజ్

యూరియా కోసం ఆందోళన

గన్నేరువరం: యూరియా కోసం రైతులు గన్నేరువరంలోని గ్రోమోర్ దుకాణం ఎదుట శనివారం ఆందోళన చేశారు. డిమాండ్‌కనుగుణంగా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూరియా షాప్ వద్దకు రైతులు వెళ్తే ఇతర వాటితో ముడిపెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. 3 రోజులుగా మందు బస్తాల కోసం వచ్చినా ఒక్క బస్తా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవో కిరణ్మయి, పోలీసులు చేరుకోగా.. రైతులు తమ సమస్యను విన్నవించారు. అనంతరం స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఏవో మాట్లాడుతూ.. ప్రతీ రైతుకు ఆధార్ నంబర్ నమోదు చేసి 4 నుంచి 5 యూరియా బస్తాలు ఇస్తున్నట్లు, రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ఆందోళన చేస్తున్న రైతులు

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

చొప్పదండి: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను, ప్యాక్స్ ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్టర్లు నిర్వహించాలని, స్టాక్ బోర్డులు కనిపించాలని ఆదేశించారు. ఏవో వంశీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

మిషన్‌భగీరథ పైపులు తొలగింపు



పైపులు తొలగిస్తున్న కార్మికులు

శంకరపట్నం: కరీంనగర్-వరంగల్‌జాతీయ రహదారి నిర్మాణం, బైపాస్ నిర్మాణంలో భాగంగా శనివారం రహదారిపై ఉన్న మిషన్ భగీరథ పైపులను తొలగించారు. తాగునీటి సమస్యలు ఏర్పడకుండా పనులు వేగంగా చేపట్టనున్నట్లు డీబీఎల్ కంపనీ సూపర్‌వైజర్ తెలిపారు

దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు చేయూత



డా.శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకుడు, విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు జమ్మికుంట రూప కంటి ఆసుపత్రి డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి 76వ జన్మదినం సందర్భంగా రూ.25వేల విలువైన నిర్మాణ సామగ్రిని శనివారం అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డిని పాఠశాల వ్యవస్థాపకుడు సుత్రపు బుచ్చిరాములు సన్మానించారు.

ముందస్తు స్నేహితుల దినోత్సవం

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామ అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం ముందస్తు స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

మంత్రిని కలిసిన రజక సంఘం సభ్యులు



మంత్రి సంజయ్‌కి వినతి పత్రం అందజేస్తున్న రజక సంఘం సభ్యులు

గన్నేరువరం: గన్నేరువరం మడేలేశ్వర స్వామి గుడి గోడ నిర్మాణం కోసం శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

మానకొండూర్ రూరల్: నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్‌లో భాగంగా మండలంలోని పచ్చునూర్ రైతువేదికలో శనివారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఏవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పురుగు మందులను మోతాదులో వాడాలని, నానో యూరియాను ఇతర పురుగు మందుతో కల్పి స్ప్రే చేసుకోవాలని సూచించారు.

తల్లి పాల వారోత్సవాలు



రామడుగులో సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

రామడుగు: రామడుగు మండలం గోపాల్‌రావుపేట, రామడుగులో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. గర్భిణిలకు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, హెల్త్ సూపర్‌వైజర్ స్వామి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గ్రామ కమిటీ ఎంపిక



నూతన కార్యవర్గం

గంగాధర: మండలంలోని నర్సింహులపల్లి గ్రామ అంబేడ్కర్ సంఘం గ్రామ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లారపు శేఖర్, ఉపాధ్యక్షుడిగా కల్లెపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నియ్యారు.

సంక్షిప్త వార్తలు

● గురుకులం సందర్శించిన అడిషనల్ కలెక్టర్

మానకొండూర్: మానకొండూర్ మహాత్మజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను శనివారం అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. వంటగదులు, కూరగాయాలను పరిశీలించారు. విద్యార్థులచే పద్యాలు చదివించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంఈవో మధుసుదనాచారి, ప్రిన్సిపాల్ లవీణా తదితరులు పాల్గొన్నారు.

● నేడు నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

తిమ్మాపూర్: నీట్ పీజీ ప్రవేశ పరీక్షలు తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్, అయాన్ డిజిటల్ సెంటర్‌లో, జ్యోతిష్మతి, శ్రీ చైతన్య కళాశాలలో నిర్వహించనున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షకు రెండు గంటల ముందే కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష జరగనుంది. నిమిషం ఆలస్యం అయినా అనుమతించరు. ఎలక్ట్రానిక్ వస్తువులు, చేతి గడియారాలు, ఆభరణాలను అనుమతించరని అధికారులు తెలిపారు.

● బీఆర్‌ఎస్‌లో చేరిక

చొప్పదండి: పట్టణానికి చెందిన పలువురు శనివారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కల్లెపెల్లి రిషి, ఉపేందర్, సన్ని, లావన్, ఆదిత్య, చక్రి, చింటు, సాయి, గణేశ్ ఉన్నారు.

● సీతారాంపూర్‌లో వెలగని వీధిలైట్లు

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్‌లో ఐదురోజులుగా రాత్రివేళల్లో వీధిలైట్లు వెలగడం లేదు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, విద్యుత్ లైన్‌మెన్‌కు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రత్యేకాధికారి శ్రద్ధ వహించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● ఇండ్లల్లోకి మురికి నీరు వస్తుందని ఆందోళన

శంకరపట్నం: ఇళ్లలోకి మురికినీరు వస్తుందని మండలంలోని కొత్తగట్టు గ్రామ దళితకాలనీ వాసులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఎన్‌హెచ్ ఏ-563 రోడ్డు నిర్మాణంలో భాగంగా మురికి కాలువలను తొలగించారు. అప్పటి నుంచి నీరంతా ఇళ్లలోకి వస్తుందని ఆరోపించారు. డీబీఎల్ కంపెనీ టిప్పర్, యంత్రాలను అడ్డుకున్నారు. కాల్వ నిర్మాణానికి కంపెనీ ప్రతినిధి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● 18 వరకు అవకాశం

గన్నేరువరం: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదోతరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం ఈనెల 18 చివరి తేదీ అని గన్నేరువరం స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రామయ్య తెలిపారు. ఆసక్తి ఉన్నవారు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రవేశాల కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● గీతకార్మికునికి తీవ్రగాయాలు

జమ్మికుంట: మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన గుర్రపు లక్ష్మణ్‌గౌడ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్‌కుమార్‌గౌడ్, మాజీ కౌన్సిలరు కోరారు.

● రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం మద్దికుంటకు చెందిన కెక్కర్ల సురేశ్ (26) మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. సురేశ్ కరీంనగర్‌లోని ఓ షోరూంలో పనిచేస్తున్నాడు. రోజూ ఉదయం వెళ్లి రాత్రి వరకు ఇంటికి చేరుకుంటాడు. శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై షోరూంకు వెళ్లి రాత్రి ఇంటికి వస్తుండగా, రంగపేట శివారులోని గోదాంల వద్ద ఇసుక టిప్పరును ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. కాగా, మృతునికి భార్య ప్రియాంక, కుమారుడు, కూతురు ఉన్నారు.